ఆంధ్రజ్యోతి సిటీ లైఫ్
AADAAB HYDERABAD
గురువారం 9, నవంబరు 2006

# రంగుల కల


నస్సీర్ సామి

**ఓ ఆర్టిస్ట్‌కు ఓ కల... ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది ఉపయోగిస్తోన్న ఓ కలర్(రంగు) గురించి అందరికీ తెలియజేయాలని. అంతేకాదు... తమ దేశంలో సముద్ర నత్తలు నుండి తొలిసారిగా తయారుచేసిన ఆ రంగు తమ జాతీయ జెండాలో స్థానం ఎలా సంపాదించిందో కూడా చెప్పాలని ఉంది. ఏడు సంవత్సరాలు ఇదే ఆలోచన. ఎక్కడికి వెళ్లినా ఇదే చర్చ.**

తనకు దొరికిన ఏ చిన్న అవకాశాన్నీ వదిలేయకుండా ప్రయత్నిస్తోన్న ఆయనకు ఇండియా అవకాశం ఇచ్చింది. అంతేకాదు ఆయన ప్రయత్నానికి ఇక్కడి కళాకారులు ఊతమిచ్చారు. అంతేనా... ఫ్రాన్స్ నుండి వచ్చిన ఓ కళాకారిణి నృత్యరీతుల్ని సమకూరిస్తే, లండన్, అమెరికా, ఇండియాలకు చెందిన నిపుణులతో కూడిన 'సౌండ్స్ ఆఫ్ ఇషా' బ్యాండ్ సంగీతాన్ని అందించింది. ఇంకేముంది... 'మెమరీ ఆఫ్ ఇండిగో' పేరిట ఎప్పటి నుండో ఆ కళాకారుడు కంటున్న కలకు దృశ్యరూపం వచ్చేసింది. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ అంతులేని ఆనందాన్నీ, అద్వితీయమైన అనుభూతిని కలిగించింది.

అలాగని ఈ కళాకారులందరూ అనుభవజ్ఞులైన వారేం కాదు. హాబీగా సంగీతాన్ని ప్రాక్టీస్ చేసి మనసు అంతరాలను తట్టి లేపిన సంగీతంతో దృశ్య రూపానికి శక్తి కట్టించినది ఇషా ఫౌండేషన్‌కు చెందిన 'సౌండ్స్ ఆఫ్ ఇషా' అయితే, కేవలం కొన్ని గంటలలోనే నృత్యరీతులను సమకూర్చిన ఘనత ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్‌జాది. ఆ నృత్యరీతుల్ని రెండు రోజుల్లోనే ఒడిసి పట్టుకుని అద్భుతంగా నర్తించినది మాత్రం భారతీయ కళాకారిణులే!

'మెమరీ ఆఫ్ ఇండిగో' పేరిట తాను కంటున్న కలకు ఓ రూపం రావటంతో ఆనందతీరాలను అధిరోహిస్తోన్న ఆ కళాకారుడు పాలస్తీనాకు చెందిన నస్సీర్‌సామి. ఆ కలర్ ఇండిగో.


సౌండ్స్ ఆఫ్ ఇషాలో బ్యాండ్‌పార్టీ


సౌండ్స్ ఆఫ్ ఇషాలో నృత్యం

వర్ణం


లూయిస్ జా

ఇండిగో సాగు దగ్గరనుండి, రంగును తయారు చేయటం, దాన్ని నూలుకు పూయటం... బట్ట తయారుచేయటం... అన్నీ 'మెమరీ ఆఫ్ ఇండిగో'లో అద్భుతంగా ఆవిష్కరించారు. విసుగుచెందే కార్యక్రమాలతో అలిసిపోయిన నగరవాసులకే కాదు, భారతీయ సంస్కృతిని తెలుసుకోవాలనుకునే విదేశీయులకు కూడా ఈ బ్యాలే చక్కటి అనుభూతిని మిగిల్చింది.

అలుపెరుగకుండా ప్రయత్నిస్తోన్న తనకు ఇషా ఫౌండేషన్ చక్కటి ఊతమిచ్చిందని చెబుతోన్న నస్సీర్ త్వరలో అన్ని దేశాల్లోనూ ఈ దృశ్య కావ్యాన్ని ప్రదర్శించే ఏర్పాట్లు చేసేస్తున్నారు. అంతేకాదు... ఏడు సంవత్సరాల తన కలకు ఓ రూపాన్నిచ్చిన హైదరాబాదీ వాసులకు కృతజ్ఞత చెప్పానే సామాన్యులకు కూడా ఈ కార్యక్రమ ఉద్దేశ్యం చేరాలనేది తన కోరిక అంటున్నాడు. అంతేకాదు... నేటి సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో జరుగనున్న తుది కార్యక్రమానికి రావాల్సిందిగా నగరవాసులను ఆహ్వానించేస్తున్నాడు.